ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 31 అక్టోబరు 2025 | 5





'మొంథా' ముందు.. తర్వాత

కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డును కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా నిర్మించింది.. తాత్కాలిక రక్షణగా బండరాళ్లను కూడా ఏర్పాటు చేశారు.. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎగసిపడిన సముద్ర కెరటాల ధాటికి రహదారి ఇలా ధ్వంసమైంది. మళ్లీ దీన్ని కొత్తగా నిర్మించాల్సి ఉంది. (ఫొటోలు: ఆంధ్రజ్యోతి, కాకినాడ ఫొటోగ్రాఫర్)

సామర్లకోట-కాకినాడ రోడ్డుపై వరదనీరు

సామర్లకోట/సర్పవరంజంక్షన్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిపై గురువారం పెద్దఎత్తున వరదనీరు చేరింది. వర్షాలతోపాటు వీకేరాయపురం-మాధవపట్నం మధ్య గోదావరి కాలువనుంచి మురుగుకాల్వకు గుర్రపుడెక్క అవరోధాల కారణంగా రెండడుగుల ఎత్తున వరదనీరు చేరింది. దీంతో సామర్లకోట-కాకినాడ మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు పరిశీలించి అధికారులతో మాట్లాడగా ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి కాలువలో అవరోధంగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించే పనులు నిర్వహించారు.



సామర్లకోట-కాకినాడ రోడ్డుపైకి చేరిన వరదనీరు.. డ్రైన్‌లో గుర్రపుడెక్క అవరోధాలను తొలగిస్తున్న దృశ్యం

మొంథా వరీయే!



చివరికిలా : కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో నీట మునిగిన వరిచేను



పెదపూడిలో మొలకలు వచ్చిన వరిపనలు పరిశీలిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

తుఫాన్ మిగిల్చిన క(న)ష్టం..

- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచేసింది.. వరి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. తుఫానుకు ముందు రెండు రోజులు అల్పపీడనాలతో కురిసిన వర్షాలకు చేలల్లో నీరు చేరి పంట దెబ్బతినగా తీవ్ర తుఫాన్‌తో మరింత నష్టపోయింది. రోజుల తరబడి నీళ్లల్లో పంట నానిపోవడంతో ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.326 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. నష్టం లెక్కింపు కొన సాగుతుండడంతో పెరిగే అవకాశం ఉంది. వరి, ఉద్యాన వన పంటలతో పాటు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల పొలాలు మునకలో ఉండడంతో యాప్ ద్వారా అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నష్టాల అంచనాలు తేల్చే పనిలో పడ్డాయి.

- లక్షలాది ఎకరాల్లో మునిగిన పంట
- లబోదిబోమంటున్న అన్నదాత
- జిల్లాల వారీగా బృందాల ఏర్పాటు
- నష్టం అంచనాల్లో అధికారులు
- వారం రోజుల్లో పూర్తి నివేదిక
- అల్పపీడనంతో అక్కడక్కడా వానలు

కాకినాడలో రూ.98 కోట్లు

మొంథా తుఫాన్ జిల్లాలో అన్నదాతను నిలువునా ముంచేసింది. భారీ ఈదురుగాలులు, కుండపోత వానతో వరి వెన్నువిరిచింది. మరికొద్ది వారాల్లో చేతికి రానున్న పంటను చిదిమేసింది.దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు లబోదిబోమంటున్నారు. తుఫాన్ బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతుండడంతో గురువారం పలు చోట్ల ఏకధాటిగా కుండపోతగా వాన కురిసింది. ఎగువున భారీ వర్షాలతో ఒక వైపు గోదావరి.. మరో వైపు ఏలేరుకు వరద ముప్పు పెరుగుతోంది. మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటడంతో వ్యవసాయశాఖ బుధవారం కాకినాడ జిల్లా వ్యాప్తంగా 368 గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేయగా గురువారం నాటికి ప్రాథమికంగా 50,700 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించారు.ఈ నష్టం విలువ రూ.98 కోట్ల వరకు అంచనా. మొత్తం జిల్లాలో 261 గ్రామాల్లో నష్టం జరగ్గా పంట నష్టపోయిన అన్నదాతలు 33,596 మందిగా గుర్తించారు.ఇది పెరగనుంది. పంట నష్టం అంచనాలు పూర్తయ్యే సరికి వారం పట్టనుంది. అత్యధికంగా పెదపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరి దెబ్బతింది. ధాన్యం తడిచి మొలకలు వచ్చేశాయి. గురువారం పర్యటించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నష్టం తీవ్రతను మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోన్‌లో వివరించారు. మొక్కజొన్న 200 ఎకరాలు, పత్తి 2,700 ఎకరాల్లో నష్టపోయింది.



తుని మండలం తిమ్మాపురంలో మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతు

తూర్పున రూ.80 కోట్లు

మొంథా కష్టమొచ్చింది..భారీ నష్టాన్ని మిగిల్చింది.. తుఫాన్ ప్రభావం కారణంగా ఈదురుగాలులు, భారీ వర్షాలకు జనజీవనం అస్త వ్యస్తమైంది. జిల్లాలో వివిధ శాఖలకు సంబం ధించి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.107 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.అధికారులు క్షేత్రస్థాయిలో అంచనాల్లో నిమగ్నమయ్యారు.జిల్లాలో 209 గ్రామాలపై తుఫాన్ ప్రభావం చూపినట్టు అంచనా వేశారు. 10,626 మంది నష్టపోయారు. వ్యవసాయరం గంలో 2115 హెక్టార్ల పంటపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 581.4 హెక్టార్లలో నష్టం జరి గింది. జిల్లాలో 56 గృహాలు దెబ్బతిన్నాయి. 68 రిలీఫ్ సెంటర్లు ఏర్పాటు చేసి, 2718 మందికి పునరావాసం కల్పించారు. 18,872 మందికి ఆహారం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. జిల్లాలో 87.99 కిలోమీటర్ల మేర 48 ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిని రూ.54.57 కోట్ల నష్టం వాటిల్లింది. పంచాయతీ రాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలోమీటర్ల మేర దెబ్బతినగా రూ.45.81 కోట్లు నష్టం వాటిల్లింది.మైనర్ ఇరిగేషన్ వనరులు 21 దెబ్బతినగా రూ.6.87 కోట్లు నష్టం జరిగింది. 123 వాటర్ ట్యాంక్‌లు డ్యామేజీ అయ్యాయి.జిల్లాలో 429 హెల్త్ సబ్-సెంటర్లు ఉన్నాయి. 251 మెడి కల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖకు రూ.37.34 లక్షలు నష్టం వచ్చినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

కోనసీమలో రూ.148 కోట్లు

మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 78 వేల ఎకరాల్లో రూ.148 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. 22 మండలాలు, మూడు పట్టణాలు, ఒక నగర పంచాయతీ పరిధిలో జరిగిన పంట నష్టాలు నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా యంత్రాంగాన్ని గురువారం ఆదేశించారు. నష్టాల అంచనాలో అధికార బృందాలు నిమగ్నమ య్యాయి. ఒకట్రెండురోజుల్లో తుఫాన్ నష్టాలను రూపొందించిన కలెక్టర్‌కు నివేదించనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రాథమికంగా 31 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు. ప్రత్యేక బృందాలను నియమించి నష్టాలను అంచనా వేస్తున్నారు. కౌలు రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో 300 విద్యుత్ స్తంభాలతోపాటు 125 కిలోమీటర్ల పరిధిలో చెట్లు, వివిధ రకాల వృక్షాలు కుప్పకూలాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని నివేదించారు.జిల్లాలో 47 పాఠశాలల్లో డ్యామేజీలు అయినట్టు విద్యాశాఖ అంచనాలు రూపొందించాయి. రానున్న ఐదు రోజుల్లో నివేదికలు రూపకల్పనలు చేసి సమర్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

తుఫాన్ బాధితులకు సాయమిలా..

తుఫాన్ వల్ల పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసరాలతో పాటు కుటుంబానికి రూ.3 వేలు, ఒంటరి వ్యక్తులకు రూ.వెయ్యి వంతున పరిహారం అందించడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. కాకినాడ తీరప్రాంతంలో ఉన్న 45 గ్రామాల్లో 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. చేనేత కార్మికులకు బియ్యాన్ని అందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వీటిని ప్రారంభించి మూడురోజుల్లోగా పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుని ఇళ్లకు వెళ్లేవారికి ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వంట నూనె, పంచదారతోపాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. పశు సంవర్ధకశాఖ 50 శాతం రాయితీపై దాణాను పంపిణీకి సిద్ధం చేసింది.



పిఠాపురంలో రహదారిపై నిలిచిన వాననీరు

వానలు..వరదలు..

తీవ్ర తుఫాన్ తీరం దాటి బలహీన పడి తీవ్ర వాయుగుండగా కొనసాగుతుండడంతో పలుచోట్ల భారీవర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం,సామర్లకోట, యు.కొత్తపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో 3 గంటలకుపైగా భారీగా కుండపోత వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ నిలిపివేశారు. మరో పక్క భారీ వర్షాలతో కాలువలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. కాకినాడ-సామర్లకోట రహదారిలో పలుచోట్ల భారీగా నీరు చేరిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. అటు ఏలేరు రిజర్వాయరుకు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో కొనసాగు తుండడంతో వరద ముప్పు పొంచి ఉంది. గురువారం ఉదయం ఇన్‌ఫ్లో 38 వేల క్యూసెక్కులకు చేరడంతో అధికారులు బెంబేలెత్తారు. ఇప్పటికే కాలువల ద్వారా నీరు 7 వేల క్యూసెక్కులకు దిగువకు వదులుతుండగా మరింత కిందకు వదిలితే అనేక మండలాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో ఆందోళన చెందారు. కిర్లంపూడిలో ఒక చోట గండిపడడంతో ఇసుక బస్తాలు ఉంచారు. ఏలేరుకు వరద తగ్గుతూ, పెరుగుతూ ఉండడంతో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ రిజర్వాయరును పరిశీలించారు.అన్నవరంలో పంపా రిజర్వాయరుకు వరద పోటెత్తుతోంది.దీంతో తుని రూరల్ పరిధిలోని తిమ్మాపురం శివారున రహదారులపై నీరుచేరింది.

నేటి నుంచి వేటకు ఓకే..

మొంథా తుఫాన్ ముప్పుతో సముద్రంలో చేపల వేటను అధికారులు నిషేధించారు. దీంతో మత్స్యకారులు ఇళ్లకే పరిమితమై ఇబ్బంది పడుతున్నారు.తుఫాన్ ముప్పు తొలగడంతో మత్స్యకారులు శుక్రవారం నుంచి వేటకు వెళ్లవచ్చని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలు నేటితో నిలిపివేయనున్నారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయం దగ్గరలో ఉన్న ఈవీఎం గోదామును ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలా ఈవీఎం గోదాము భద్రతను తనిఖీ చేసి నివేదిక పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ జగన్నాథం పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

- కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్ నిర్ధారణకు అవసరమైన ఆధునిక వైద్యపరికరాలతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల ద్వారా టర్న్‌కీ పద్ధతిలో ఆధునిక వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల సరఫరా, ఇన్‌స్టాలేషన్ ప్రారంభానికి సంబంధించి షీల్డ్ టెండర్లు కోరుతున్నామన్నారు. అంచనా వ్యయం రూ.3,41,07,736 కాగా, ఈఎండీ రిఫండబుల్ రూ.8,52,693గా నిర్ణయించామన్నారు. టెండర్ డాక్యుమెంట్లను వచ్చేనెల 1 నుంచి 14వతేదీ సాయంత్రం 5 గంటల వరకు విక్రయిస్తారన్నారు. వచ్చేనెల 17న మధ్యాహ్నం 3గంటలకు టెక్నికల్ బిడ్ ఓపెనింగ్ కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో నిర్వహిస్తారన్నారు. హార్డ్ కాపీలను సమర్పించాలన్నారు. ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లు కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. టెండర్ డాక్యుమెంట్ పొందడానికి రూ.20వేల డీడీ ఏదైనా జాతీయ బ్యాంకు ద్వారా తీసుకుని సమర్పించాలన్నారు.

మళ్లీ మొదలు

- కొనసాగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తనిఖీ
- ఒక్కో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు 9 బస్సులు
- అన్నీ పరిశీలించాకే రవాణాకు అనుమతి
- నిబంధనలు పాటించని యాజమన్యాలకు నోటీసులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



కర్నూలు బస్సు దుర్ఘటనతో రవాణ శాఖ కళ్లు తెరిచింది. జిల్లాలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈనెల 24 నుంచి 27వరకు అన్ని జిల్లాల్లో రవాణాశాఖాధికారులు తనిఖీలు జరుపుతున్నట్టే.. కాకినాడ జిల్లావ్యాప్తంగాను తనిఖీలు నిర్వహించి 30 బస్సులపై కేసులు నమోదు చేశారు. అత్యవసర ద్వారాలు లేనివి, అగ్నిమాపక పరికరాలు లేనివి, ఫైర్ అలారం సిస్టమ్ లేనివి, అనధికారికంగా మార్పులు చేసిన బస్సులపైనా కేసులుపెట్టారు. అనుమతి లేకుండా మార్పులు చేసిన, అత్యవసర ద్వారాన్ని మూసేసి సీట్లు, బెర్త్‌లు ఏర్పాటు చేసిన బస్సుల యజమానులకు వెంటనే మార్చుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. పలు బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల రద్దుకు సిఫారసు చేస్తూ రవాణాశాఖాధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఈశాన్య, ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటికి ఏపీలోని ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్‌లో మళ్లీ ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకుని ఎఫ్‌సీ పొందాలని సూచిస్తున్నారు. అత్యవసర ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బెర్తులు, సీట్లు తొలగించాలని, ఈ నిబంధనలన్నీ పాటిస్తేనే బస్సులను తిరగనిస్తామని, లేదంటే వదిలిపెట్టబోమని అధికారులు చెబుతున్నారు.

మళ్లీ మొదలు..

కర్నూలు దుర్ఘటన అనంతరం ఈనెల 24 నుంచి 27 వరుసగా నాలుగురోజులపాటు తనిఖీలు చేపట్టిన అధికారులు మొంథా తుఫాన్ ప్రభావంతో 28,29 తేదీల్లో తనిఖీలు నిలిపివేశారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆలిండియా పర్మిట్‌తో జిల్లాలో తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై దాడులు జరిపిన రవాణశాఖాధికారులు మళ్లీ గురువారం తనిఖీలు ప్రారంభించారు. జిల్లాలో ఉన్న మొత్తం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు తొమ్మిదేసి బస్సులను కేటాయించారు. ఆ బస్సులు ఎక్కడి నుంచి ఎక్కడికి తిరుగుతున్నాయి? సిట్టింగ్ విధానం ఎలా ఉంది? బస్సు పూర్తిగా కండీషన్లో ఉందా? వంటి విషయాలను పరిశీలిస్తున్నారు. లేకుంటే సరిచేసుకోవాలని ఆదేశిస్తున్నారు. అప్పటివరకు బస్సులను నడపవద్దని హెచ్చరించారు. జిల్లా నుంచి సీజనల్‌గా రోజుకు 20 నుంచి 30 వరకు వివిధ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఉద్యోగ, వ్యాపార ఇతరత్రా పనులపై వెళ్లేవారు వీటినే ఆశ్రయిస్తారు. చాలా బస్సులు పీఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న మెక్లారిన్ హైస్కూల్ పాయింట్ వద్ద నుంచి బయల్దేరుతాయి. కొన్ని బస్సులు జడ్పీ సెంటర్ సమీపంలో ప్రయాణికులను ఎక్కించుకుంటాయి. ఇతర ప్రాంతాల నుంచి కాకినాడ వచ్చిన బస్సులను కొందరు డ్రైవర్లు కాకినాడ-సామర్లకోట రోడ్డులో నిలుపుతారు. వాటన్నింటినీ కూడా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు.

ఈ తనిఖీలు కొనసాగేనా?

ఎక్కడైనా.. ఏదైనా ప్రమాదం జరిగితే రెండు రోజుల పాటు అధికారులు హడావిడి చేసి చేతులు దులిపేసుకుంటారు. తర్వాత ఎవరెన్ని నిబంధనలు ఉల్లంఘించినా పట్టించుకోరు. అసలు వాహనాలకు రికార్డులు ఉన్నాయా? రికార్డులు లేని వాహనాలు ఎన్ని? రోడ్లపై తిరుగుతున్న వాహనాలు సక్రమంగానే తిరుగుతున్నాయా? లేదా? అనే విషయాలను పట్టించుకోరు. కాకినాడ నగరంలో పాత బస్టాండ్ ఏరియాలో కొన్నిప్రాంతాల్లో లాఅండ్ ఆర్డర్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ఎలాంటి రికార్డులు లేని 88 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. ఇవి కేవలం రెండు, మూడు ప్రాంతాల్లో దొరికినవి.. జిల్లావ్యాప్తంగా తనిఖీ చేస్తే ఇంకెన్ని దొరుకుతాయో అనేది పోలీసు, రవాణాశాఖ అధికారులకే తెలియాలి. కేవలం ప్రమాదాలు జరిగే సమయాల్లో మాత్రమే కాకుండా ఇతర సమయాల్లోను విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చు.

తుఫాన్ బాధితులకు పరిహారం పంపిణీకి కసరత్తు

- జిల్లాకు రూ.1.50కోట్లు కేటాయించనున్న రాష్ట్ర ప్రభుత్వం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల బిక్కుబిక్కుమంటూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధితులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలో ఐదు మండలాలు తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవుల్లో బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున ఇచ్చేందుకు అధికారుల కసరత్తు జరుగుతోంది. 5వేల కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకునేందుకు అధికారులు జాబితాలు తయారు చేస్తున్నారు. దీనిలో మత్స్యకారులకు అత్యధికంగా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పూర్తిగా పునరావాస కేంద్రాల్లో ఉండిపోయిన వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీనికోసం ప్రభుత్వం రూ.కోటి50లక్షల వరకు నిధులు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 41,932మంది బాధిత కుటుంబాలకు 25 కిలోలనుంచి 50కిలోల వరకు బియ్యం పంపిణీ చేయడం ప్రారంభించారు. ఒక్కో కుటుంబానికి కిలో చొప్పున పంచదార, కందిపప్పు, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఇస్తున్నారు.

ఏలేరు జలాశయాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే



ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయర్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఏలేరు జలాశయంలో భారీ స్థాయిలో వరదనీరు వచ్చి చేరడంతో కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం సందర్శించారు. పరివాహక ప్రాంతంనుంచి జలాశయానికి వచ్చే నీరు, దిగువ ప్రాంతానికి విడుదలవుతున్న నీటి వివరాలు ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏలేరులో నీటిమట్టం 23వేల క్యూసెక్కులకు చేరడంతో దిగువకు అధిక మొత్తంలో నీరు విడుదల చేయాల్సి వస్తోందన్నారు. దీంతో తుఫాన్ కారణంగా పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, కొత్తపల్లి, సామర్లకోట, కిర్లంపూడి మండలాల్లో కాలువలు, రోడ్లు పొంగి 6వేల హెక్టార్ల పంటనష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని కలెక్టర్ తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏలేరు పరివాహక ప్రాంత రైతులకు ఇబ్బంది లేకుండా జలాశయంనుంచి క్రమక్రమంగా దిగువకు నీటిని విడుదల చేస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపీనాథ్, జనార్ధన్, రవికుమార్, శ్రీకాంత్, ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు పాల్గొన్నారు.

జిల్లాపై తీవ్ర ప్రభావం

పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలేరు నుంచి భారీగా వరద జలాలు విడుదలతో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, కిర్లంపూడి, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, ఏలేశ్వరం మండలాలపై తీవ్ర ప్రభావం ఉండనుంది. పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు ముంపునకు గురవుతాయి. రహదారులపై వరద నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో లక్ష ఎకరాల్లో పంటలు ముంపు ప్రమాదం పొంచి ఉంటుంది.

గతేడాది ఏలేరుకు సంభవించిన భారీ వరదలతో ఏలేరు, పీబీసీ పరిధిలో 280కిపైగా ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. 350 ప్రాంతాల్లో గట్లు కోతకు గురయ్యాయి. కళింగల్స్ స్లూయిజ్‌లు, రెగ్యులేటర్లు దెబ్బతిన్నాయి. అత్యవసరమైన గండ్లను మాత్రమే పూడ్చారు. మిగిలిన గండ్లు పూడ్చేందుకు ఆలస్యంగా నిధులు విడుదలతో పనులు చేపట్టలేదు. కోతకు గురైన గట్లకు రైతులు తాత్కాలికంగా ఇసుకబస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. ఏలేరు నుంచి నీటిని విడుదలతో పలుచోట్ల కాలువలు కోతకు గురవుతున్నాయి. కొన్నిచోట్ల ఇసుకబస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆయుధాలివిగో...



- అమలాపురం ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో 'ఓపెన్ హౌస్'
- విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసు అధికారులు
- ఆయుధాలు, డాగ్ స్క్వాడ్‌లతో డెమో ఇచ్చిన ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులంటే ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టడంతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసులను దగ్గరకు చేయాలనే సంకల్పంతో విద్యార్థి దశ నుంచే పోలీసుల విధి నిర్వహణపై అవగాహన కల్పించే లక్ష్యంతో 'ఓపెన్ హౌస్' నిర్వహిస్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పేర్కొన్నారు. అమలాపురంలోని కోనసీమ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లోభాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రాహుల్ మీనా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పోలీసు విధి నిర్వహణలో ఉపయోగించే డ్రోన్ పరికరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయడంలో పురోగతి సాధిస్తున్నామన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఇంటికి రక్షణ కల్పించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం కారణంగా జరిగిన ప్రమాదాల్లో 19 మంది మరణించారన్నారు. సమాజంలో 99.09 శాతం మిగిలిన ఒక్క శాతం జనాభాలో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా

పోలీసు శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆధునిక పరికరాలు, వివిధ ఆయుధాలైన ఎస్ఎల్ఆర్, ఏకే 47, ఎంపీ5కే, టియర్ గ్యాస్ గన్స్ వీపీ జాకెట్ల పనితీరును ఆర్మ్‌డ్ రిజర్వు విధులను వివరించారు. సాంకేతిక ప్రదర్శన, క్లూస్‌టీమ్, కమ్యూనికేషన్ వ్యవస్థ, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ పరికరాలు, డ్రోన్, డాగ్ స్క్వాడ్ వంటి కీలక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, నేరస్తులను గుర్తించే విధానాన్ని డెమో చేసి ఎస్పీ సమక్షంలో చూపించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అటువంటి నేరాలకు గురైతే 1930కు కాల్‌చేసి జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకతాయిల బారి నుంచి రక్షణ కోసం 112కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అడ్మిన్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, అమలాపురం డీఎస్పీ ప్రసాద్, ఎస్‌టీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఏఆర్ ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు, దిలీప్, అనేక మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఆయుధాలను తిలకిస్తున్న విద్యార్థులు

కరాటే, బాడీబిల్డింగ్, కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ... ఈ క్రీడాంశాల్లో అతడికి అతడే సాటి... పోటీ ఎక్కడైనా పతకం అతడిదే.... గ్రామీణ ప్రాంతంలో పుట్టిన ఈ యువకుడు మార్షల్ ఆర్ట్స్‌లో మాస్టర్. అతడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకకు చెందిన గుత్తాల రారాజు. క్రీడలు, వ్యాయామంపై ఉన్న ఆసక్తే అతడిని ఈ స్థాయికి తీసుకెళ్లింది.



మార్షల్ ఆర్ట్స్‌లో రారాజు



- నిరంతర సాధనతో సత్తాచాటుతున్న లంకాఫ్ ఠాణేలంక యువకుడు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 14 పతకాలు కైవసం
- విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)



స్వీయ రక్షణపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రారాజు

మారుమూల లంక గ్రామమమైన లంకాఫ్ ఠాణేలంకలో వ్యవసాయ కుటుంబానికి చెందిన గుత్తాల లక్ష్మీనారాయణ-పల్లాలమ్మ దంపతుల నాలుగో మగ సంతానం రారాజు. తండ్రి ఇటీవలే మృతి చెందాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న రారాజుకు కరాటేపై మక్కువ. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కరాటేలో సాధన చేస్తున్న యువకులను చూసి దానిపై ఆసక్తి పెంచుకున్నాడు. తొలుత రాజుపాలేనికి చెందిన వీవీఎస్ వర్మ, పల్లిపాలేనికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాస్, అయినాపురానికి చెందిన చిక్కాల పనసయ్య వద్ద శిక్షణ పొందాడు.మెళకువలు తెలుసుకుని బంగారు, రజత పతకాలు సాధించాడు. బాడీబిల్డింగ్‌లో చాంపియన్‌గా నిలిచి రజత పతకాలు గెల్చుకున్నాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. కిక్ బాక్సింగ్‌లో బ్లాక్ బెల్ట్ పొంది యువతకు ఆదర్శంగా నిలిచాడు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశం వచ్చినా వదిలి తాను నేర్చుకున్న విద్యను పలువురికి అందించాలని 2019లో ముమ్మిడివరంలో రారాజు జిమ్, స్పోర్ట్స్ అకాడమీ స్థాపించాడు. జిల్లాలో వందలాది మందికి శిక్షణ ఇచ్చాడు. ప్రస్తుతం అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో తన జిమ్ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్, ఆరోగ్యకరమైన అంశాలను తెలియజేస్తున్నాడు. ఆపదలో తమను తాము ఎలా రక్షించుకోవాలనే నేర్పుతున్నాడు.

ముమ్మిడివరంలో త్వరలోనే జిమ్, స్పోర్ట్స్ అకాడమీ స్థాపించేందుకు స్థలాన్ని కూడా సేకరించాడు. అందుకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం, ఆర్థిక భరోసా కోసం రారాజు ఎదురు చూస్తున్నాడు.



చిన్నప్పటి నుంచీ నాకు క్రీడలంటే ఆసక్తి ఉండేది. వాటిపైనే దృష్టి పెట్టాను. వివిధ పోటీల్లో పాల్గొన్నాను. దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణుల నుంచి మెళకువలు నేర్చుకున్నాను. విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇస్తున్నాను.... **రారాజు**







పతకాల రారాజును అభినందిస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ (పాత చిత్రాలు)

సాధించిన పతకాలు ఇవే...

2011: కోనసీమ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
2012: కోనసీమ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం
2013: రాజమహేంద్రవరంలో జరిగిన స్టేట్ స్టైలిష్ ఇన్విటేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం.
2014: రాజమహేంద్రవరంలో జరిగిన 8వ స్టేట్ ఓపెన్ కరాటే-కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
2014: విశాఖలో జరిగిన 35వ స్టేట్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2014: గాజువాకలో జరిగిన ఆలిండియా స్పోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్, సుమన్ కరాటే చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2015: విశాఖలో జరిగిన 12వ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2015: విశాఖలో జరిగిన 18వ ఆలిండియా వడాకీ కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2015: కాకినాడలో జరిగిన 4వ ఏపీ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2016: విశాఖలో జరిగిన వడాకీ కరాటే చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2016: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో జరిగిన ఏపీ స్టేట్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో బంగారు పతకం.
2018: గుంటూరులో జరిగిన 2వ ఏపీ స్టేట్ హిటో జపాన్ షాడోకాన్ కరాటే ఇన్విటేషన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం.

ఉద్యోగులు ప్రజాసేవలో ముందుండాలి

ఆర్టీసీ జోన్-2 ఈడీ విజయరత్నం.. హెవీ డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్ ప్రారంభం



హెవీ డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఈడీ విజయరత్నం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని విజయవంతం చేసినందుకు ఉద్యోగులందరినీ అభినందిస్తున్నామని, అదే ఉత్సాహంతో ఉద్యోగులు ప్రజాసేవలో ముందడుగు వేయాలని ఆర్టీసీ విజయవాడ జోన్-2 ఈడీ జి.విజయరత్నం అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆయన హెవీ డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యారేజీ ఆవరణలో మొక్క నాటారు. డిస్పెన్సరీ, బస్‌స్టేషన్, కార్గో కౌంటర్, గ్యారేజీ, డిపో మేనేజర్ కార్యాలయం, ఎర్నింగ్ సెక్షన్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందబోయే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, డిపో మేనేజర్ కె.మాధవ, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) శేషారావు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేకు పరిశోధనా ప్రాజెక్టు మంజూరు

జేఎన్టీయూకే, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ రూ.2.81 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టును కాకినాడ జేఎన్టీయూకు మంజూరు చేసినట్టు రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఏఐ డ్రివెన్ సొల్యూషన్ ఫర్ ఆటోమేషన్ ఆఫ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ రెమిడియేషన్ అనే శీర్షికతో ఈ ప్రాజెక్టు రెండేళ్లలో అమలుకానుంది. సైబర్ ముప్పులను గుర్తించడం, వాటి నివారణలో ఆటోమేషన్ సాధించడం, దేశీయ డిజిటల్ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత రూపకల్పనను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యమన్నారు. దీనికి సీఎస్ఈ ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి ప్రధాన పరిశోధకుడిగాను, డాక్టర్ టి.శివరామకృష్ణ సహ పరిశోధకుడిగాను వ్యవహరిస్తారని తెలిపారు. ఈ బృందం దేశంలోని సైబర్ సెక్యూరిటీ సంస్థలతో సమన్వయం సాధించి ప్రాజెక్టు ఫలితాలను జాతీయ భద్రతా అవసరాలకు అనుగుణంగా ఉండేలా పనిచేయనుంది. ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ప్రధాన పరిశోధకుడు, సహ పరిశోధకుడిని అభినందించారు.

సత్యదేవుడి తెప్పోత్సవానికి పంటు ట్రైల్ రన్



పంటుకు ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు 2న జరిగే సత్యదేవుడి తెప్పోత్సవానికి వినియోగించే పంటుకు గురువారం దేవస్థానం, ఇరిగేషన్ అధికారులు ట్రయిల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం మరోసారి ట్రయిల్‌రన్ నిర్వహిస్తామని విద్యుత్ విభాగ డిఈ సత్యనారాయణ తెలిపారు. మరమ్మతులు పూర్తయ్యాయని విజయవంతంగా పంపా సరోవరంలో మూడుసార్లు తిరిగిందని డీఈ తెలిపారు. త్వరలో పంటును హంస వాహనంగా తీర్చిదిద్దుతామన్నారు.

అన్నదానానికి రూ.2.10 లక్షలు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.2.10 లక్షలు విరాళంగా సమర్పించారు. వేమగిరికి చెందిన పేరూరి శ్రీనివాసరావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.



విరాళం అందజేస్తున్న పేరూరి శ్రీనివాసరావు

ఇసుక దందాకు అడ్డేది..?



పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదీలో ఇసుక తవ్విన దృశ్యం, తాత్కాలిక బాట

- పురుషోత్తపట్నం, గుండాల గోదావరి నదీ ప్రాంతాల్లో తవ్వకాలు
- తెలంగాణకు తరలింపు
- సరిహద్దుల్లో నిల్వలు
- బోర్డర్ దాటుతున్న ఆంధ్ర ఇసుక
- చోద్యం చూస్తున్న అధికారులు

ఎటపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో గోదావరి నదీ ప్రాంతాలే లక్ష్యంగా చేసుకుంటూ కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక దందాను నడిపిస్తున్నారు. ప్రధానంగా పురుషోత్తపట్నం, గుండాల, గొమ్ముకొత్తగూడెం, రాయనపేట, ఎటపాక, తదితర గోదావరి నదీ ప్రాంతాల్లో తాత్కాలిక ర్యాంపులు ఏర్పాటు చేస్తూ ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో ఇసుక అక్రమార్కులకు వరంగా మారుతోంది. పక్కనే అనుకుని(తెలంగాణ) భద్రాచలం పట్టణం ఉండడంతో ఇసుక అక్రమార్కులకు మరింత కలిసోస్తోంది.. దీంతో ఎటపాక మండలంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. రాత్రి వేళల్లో నదీ ప్రాంతాల్లో నిఘా వేస్తూ ఏంచక్కా ఇసుక దందాను చక్క బెడుతున్నారు. అందిన కాడికి ఇసుకను దండుకుంటున్నారు.. యథేచ్ఛగా ఆంధ్రా ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తూ....





ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

తెలంగాణలోని భద్రాచలం పట్టణంలో అమ్మకాలు చేస్తూ సొమ్ములు గడిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలువరించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ క్రమంలో పురుషోత్తపట్నంలో వారం రోజులుగా అక్రమార్కులు రాత్రుళ్లు తవ్వకాలు చేస్తూ ఇసుకను భద్రాచలం తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నడిపిస్తున్నారు. తెల్లవారే వరకు ఈ దందా నడుస్తుంది. ఆంధ్రాలో తవ్వకాలు చేపడతూ... తెలంగాణలో అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌లోడ్‌ఇసుకను తెలంగాణలో రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయిస్తున్నారు. ఇదేకాక అక్రమార్కులు గోదావరి ప్రాంతాల నుంచి తవ్వకాలు చేసిన ఇసుకను సరిహద్దు ప్రాంతాల్లో నిల్వలు ఉంచుతున్నారు. ముఖ్యంగా ఎటపాకలోని ఓ ప్రయివేట్ ట్రాక్టర్ షోరూం పక్కన, ఇదే ప్రాంతంలో ఇటుక బట్టీల వద్ద, రాజుపేట సమీపంలో పలు చోట్ల, ఇసుక నిల్వలు పెడుతూ అర్ధరాత్రుళ్లు ఆంధ్రా సరిహద్దును దాటిస్తున్నారు. టిప్పర్ లోడ్ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, ట్రాక్టర్ దూరాన్ని బట్టి రేటు రూ.4 వేలు నుంచి రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఈ దందా అంతా రాత్రి సమయంలోనే చక్కబెడుతున్నారు.తెల్లవారే సరికి దందా చేసినట్టు ఆనవాళ్లు కూడా కన్పించకుండా చేస్తారు. ఇసుక దందా నిరంతరం జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు కన్నెత్తయినా చూడడంలేదని విమర్శలు విన్పిస్తున్నాయి. కాగా బుధవారం అర్ధరాత్రి పురుషోత్తపట్నం గోదావరి నదీ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో రెవెన్యూ అధికారులు సరిహద్దులోని సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద నిఘా పెట్టారు.ఆంధ్రాలోని పురుషోత్తపట్నం నుంచి ఇసుక లోడ్ వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పురుషోత్తపట్నం గ్రామస్థుల్లో కొందరు ఈ దందా నడిపిస్తున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది.ఈ విషయమై తహశీల్దార్ కారం సుబ్బారావును వివరణ కోరగా పురుషోత్తపట్నం నదీ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపినట్టు సమాచారం అందిందని, దాంతో గురువారం ఆ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు యంత్రాలతో కందకాలు తవ్వినట్టు చెప్పారు. అలాగే రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం



పాశుపతాభిషేకం నిర్వహిస్తున్న రుత్వికులు

పిఠాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంత్యుత్సవాల్లో రెండో రోజైన గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి.ఉదయం శ్రీపాదశ్రీవల్లభుడికి సహస్ర లింగార్చన, మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం జరిపారు. సాయంత్రం లక్ష్మీగణపతి సహిత రుద్ర హోమం, దత్త మూలమంత్ర హోమం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు.ఉదయం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో సప్త నదీ జలాలకు రుత్వికులు ప్రత్యేక పూజలు, గో పూజ నిర్వహించారు.ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసన్న దేవస్థానానికి వీల్‌చైర్ బహూకరణ

అంతర్వేది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి విజయవాడకు చెందిన భాష్యకార చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు వీల్‌చైర్‌ను బహూకరించారు. రూ.20వేలు విలువగల ఈ వీల్‌చైర్‌ను భక్తుల సౌకర్యార్థం ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఏసీ అందజేశారు.

వంద రోజుల కార్యాచరణను పక్కాగా అమలు చేయాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ నాగమణి

కరప, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నిర్దేశించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేసి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని విద్యా శాఖ ఆర్జేడీ జి.నాగమణి సూచించారు. కాకినాడ జిల్లా కరప జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సిలబస్ పూర్తి, విద్యార్థుల ప్రగతి, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులకు ప్లానింగ్‌తో పరీక్షలకు ప్రిపేరై మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం మెయిన్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని, వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో సాయిదుర్గకు కాంస్యం



అంబాజీపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన కె.సాయిదుర్గ బ్రాంజ్ మెడల్ సాధించినట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో సాయిదుర్గ అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాయిదుర్గను పలువురు అభినందించారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషనులో 'యాత్రి సువిధా కేంద్రా'

- రద్దీ సమయంలో హైరానాకు చెక్
- ఢిల్లీలో విజయంతో మరిన్ని ఏర్పాటు
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- ద.మ.రైల్వే జోన్‌లో రాజమండ్రి ఎంపిక

రాజమహేంద్రవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ని ప్రయాణికుల నిర్వహణ కోణంలో మరింత అభివృద్ధి చేయనున్నారు. ప్రయాణికులు పోటెత్తినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండడమే ప్రధాన ఉద్దేశంగా ఢిల్లీ మాదిరిగా ప్యాసింజర్స్ హోల్డింగ్ ఏరియాలను శాశ్వత ప్రాతిపదికన నిర్మించనున్నారు. ఈ 'యాత్రి సువిదా కేంద్రా'లను దీపావళి, ఛత్‌పూజా సందర్భంగా ప్రయాణికుల నియంత్రణలో భాగంగా ఢిల్లీలో నిర్మించి విజయం సాధించారు. దీంతో 16 రైల్వేజోన్లలోని 76 రైల్వే స్టేషన్లలో వీటిని 2026 పండుగల సీజన్‌లోపుగా పూర్తిచేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ జాబితాను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో సికింద్రాబాద్, విజయవాడ, తిరుపతి, గుంటూరు, కాచిగూడతోపాటు రాజమండ్రి రైల్వేస్టేషను కూడా ఉంది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో భద్రత దగ్గర నుంచీ సదుపాయాల వరకూ ఇబ్బందులు పడకుండా, అప్పటికప్పుడు హైరానా లేకుండా చేయడమే 'యాత్రి సువిధా కేంద్రా'ల ముఖ్య లక్ష్యంగా చెప్పవచ్చు. దీనిలో భాగంగా ఆయా ప్రదేశాల్లో టికెట్ కౌంటర్లు, ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ యంత్రాలు, ఉచిత తాగునీరు, వేచి ఉండడానికి ఏర్పాట్లు, ఆడ, మగ వారికి విడివిడిగా వాష్‌రూమ్స్, సీసీ కెమెరాలు, విచారణ కౌంటర్లు, డిస్‌ప్లే బోర్డులు, అనౌన్స్‌మెంట్ సిస్టం తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. ఒకవేళ రైలు రాక ఆలస్యమైనా ఇబ్బందులు పడకుండా, అందరూ ఒకేచోట గుమిగూడడం, ప్లాట్‌ఫామ్‌లపై రద్దీ ఉండడం, రైలు వచ్చినప్పుడు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉరుకులు పరుగులు పెట్టడం వంటి సమస్యలకు ఈ హోల్డింగ్ ఏరియాతో చెక్ పెట్టనున్నారు. ప్రస్తుతం రాజమండ్రి రైల్వేస్టేషను గుండా రోజుకు సుమారు 40వేల మంది ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సంఖ్య ప్రత్యేక దినాల్లో రెట్టింపు అవుతుంది. ఆ సమయంలో రైల్వే ప్లాట్‌ఫామ్‌లు కిక్కిరిసిపోతున్నాయి. భద్రత కత్తిమీద సాముగా మారుతోంది. రానున్న పుష్కరాలకు రోజుకు ఈ రైల్వేస్టేషను ద్వారా దాదాపు 1.50లక్షల మంది ప్రయాణించవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యాత్రి సువిధా కేంద్రా నిర్మాణం ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. విధివిధానాలు స్థానిక అధికారులకు అందాల్సి ఉంది. ఢిల్లీలో 7వేల మంది ప్రయాణికులకు సరిపడా హోల్డింగ్ ఏరియాను అభివృద్ధి చేసి 150 వాష్‌రూమ్స్, టికెట్ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేయడంతో వేలాది మంది ప్రయాణికులను సులభంగా హ్యాండిల్ చేయగలిగారు. దీంతో యాత్రి సువిధా కేంద్రాలు మరిన్ని స్టేషన్లలో అవసరమని గుర్తించారు. ఆ జాబితాలో రాజమండ్రి ఉండడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




ఆకాశంలో రెడ్ అలర్ట్

యానాం ఫెర్రీరోడ్డులోని రాజీవ్‌గాంధీ బీచ్ గోదావరి ఒడ్డున ఆకాశం ఎర్రబడింది. గత నాలుగు రోజులుగా మొంథా తుఫాన్‌తో మురిసి ఉన్న ఆకాశం గురు వారం సూర్యుని రాకతో సూర్యాస్తమ సమయంలో ఆవిష్కృతమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.
-యానాం-ఆంధ్రజ్యోతి

పోలవరం కాలువలో పడి వ్యక్తి మృతి


చరణ్ మృతదేహం

గోకవరం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పోల వరం కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని వెదురుపాక గ్రామానికి చెందిన దూళ్ళపల్లి చరణ్(20), మన్యం వెంకటేష్, ఆరుగుల్లి సతీష్ కలిసి అచ్చుతాపురం-తంటి కొండ గ్రామ సమీపంలో ఉన్న పోలవరంకా లువలో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈక్రమ ంలో కాలువ దాటుతుండగా నీటి ఉధృతికి చరణ్ కొట్టుకుపోయాడు. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో వారు రంగప్రవేశం చేసి నాటు పడవ సహాయంతో ఈతగాళ్ళను దింపి గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు చరణ్ మృతదేహాన్ని ఈతగాళ్లు కాలువ నుంచి బయటకు తీసికొచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెదురుపాక గ్రామానికి చెందిన దూళ్లపల్లి దుర్గ, నాగమణి దంపతులకు కుమారుడు చరణ్‌తోపాటు ఇద్దర కుమార్తెలు ఉన్నారు. దుర్గ గోకవరంలో మొక్కజొన్న పొత్తులు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చరణ్‌కు ఆరు నెలలు క్రితమే వివాహమైనట్టు సమాచారం.

యువకుడి మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రెండ్రోజుల క్రితం సముద్రంలో గల్లంతైన ఓ మత్స్యకార యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరాం (21) భార్య మీనాక్షి, ఒక కుమారుడు ఉన్నారు. ఆ యువకుడు ఓ బోటుపై పనిచేస్తూ చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో స్థానిక కుంబాభిషేకం రేవు వద్ద బోటును సహచరుల సహాయంతో లంగర్‌వేసి నిలుపుదల చేశాడు. అయితే ఆ సమయంలో తుఫాను తాకిడి ఉధృతంగా ఉండడంతో బోటును మరింత భద్రత ఉండే ప్రదేశంలో నిలుపుదామన్న ఆలోచనతో స్థానిక ఏటిమొగ కల్వర్ట్ వద్ద నిలుపుదామన్న ఆలోచనతో మంగళవారం సహచరులతో కలిసివెళ్లి లంగరు తీస్తున్న సమయంలో ఈదురుగాలులతో కూడిన పెద్ద అల సాయిరాంను సముద్రంలోనికి లాగేయడంతో గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు గాలింపులు చర్యలు చేపట్టినా యువకుడి ఆచూకీ దొరకలేదు. గురువారం కుంబాభిషేకం సమీపంలోకి జీఎంఆర్ పవర్‌ప్లాంట్ వద్ద సాయిరాం మృతదేహం పోలీసులకు లభ్యమయ్యింది. అనంతరం పోర్టు సీఐ సునీల్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రలకు వెళితే ఇంటిని దోచేశారు

కాకినాడరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌మండలం తూరంగికి చెందిన డి.శ్రీనివాసరావు రిలయన్స్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లాడు. బుధవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి ఇంద్రపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బీరువాలో పెట్టిన 17 గ్రాముల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు చోరీకిగురయ్యాయని, బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగి..తగ్గి..పెరుగుతూ

'ఏలేరు'కు భారీగా ఇన్‌ఫ్లో

- కాలువలకు 8,675 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- పొంచి ఉన్న భారీ వరద ముంపు ప్రమాదం
- రైతులు, ప్రజలకు కంటి మీద కునుకు కరవు


గొల్లప్రోలు కాలువ వద్ద ఏలేరు వరద నీటి ఉధృతి


ఏలేరు నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఏలేరుకు భారీగా వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లోస్ రైతులు, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఉదయం ఒకేసారి భారీగా పెరిగి మరలా తగ్గుతూ వచ్చి సాయంత్రానికి మరోమారు పెరగడంతో దిగువకు భారీగా వరద జలాలు విడుదల చేయక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదే జరిగితే వేలాది ఎకరాలు ముంపునకు గురికావడంతో పా టు గ్రామాల్లోకి ఏలేరు వరద నీరు ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి.

పిఠాపురం/ఏలేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి పెరుగుతున్న ఇన్‌ఫ్లోస్ 10గంటల సమయంలో ఒక్కసారి 38వేల క్యూసెక్కులకు చేరడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. తదనంతరం తగ్గుతు, పెరుగుతూ మధ్యాహ్నం 12, సాయంత్రం 5గంటల సమయంలో 16-12వేల క్యూసెక్కులకు తగ్గిందని ఊపిరి పీల్చుకునే సమయంలోనే సాయంత్రం 6గంటలకు మరోసారి ఇన్‌ఫ్లోస్ 23,600 క్యూసెక్కులకు చేరాయి. దీంతో ఉదయం 6గంటలకు 85.39 మీటర్లుగా ఉన్న నీటిమట్టం 85.67మీటర్లకు చేరగా, నీటినిల్వలు 21.74 టీఎంసీలు నుంచి 22.30 టీఎంసీలకు పెరిగాయి. గరిష్ఠ నీటిమట్టం 86.56మీటర్లు కాగా నీటిని 24.11 టీఎంసీల వరకూ నిల్వ ఉంచే అవకా శం ఉంది. ఇదే జరిగితే ఇన్‌ఫ్లోస్ ఎంత వస్తే అంతా దిగువకు విడుదల చేస్తారు.

అవుట్‌ఫ్లోస్ పెంపు

ఉదయం 4,675 క్యూసెక్కులుగా ఉన్న నీటి విడుదలను 10గంటలకు 5,675 క్యూసెక్కులకు పెంచగా, 11 గంటలు దాటిన తర్వాత 7,175 క్యూసెక్కులకు, రాత్రి 9 గంటలకు 8,675 క్యూసెక్కులకు చేరుకుంది. ఏలేరు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరుతున్న తరుణంలో నీటి విడుదల రాత్రి ఏ సమయంలోనైనా 10వేలు క్యూసెక్కులకు, అప్పటికి ఇన్‌ఫ్లోస్ తగ్గకుంటే 15వేల క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. మొంథా తుఫాన్ దృష్టిలో ఉంచుకుని ఏలేరు రిజర్వాయర్ ఉన్న నీటిని దిగువకు విడుదల చేయడంతో భారీగా ఇన్‌ఫ్లోస్ వచ్చినా వెంటనే భారీగా నీరు విడుదల చేసే పరిస్థితి తప్పిందని వారు తెలిపారు.

పంపా రిజర్వాయర్‌కు పెరిగిన నీటిమట్టం

అన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంపా రిజర్వాయర్‌కు ఎగువప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటివరకు 99 అడుగుల నీటిమట్టం గురువారం 101 అడుగులకు చేరింది. 1700 క్యూసెక్కులు నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా వరద కాలువ, స్పిల్‌వే నుంచి 1650 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలిపారు. పుష్కర అక్విడెక్ట్‌వద్ద పనులకు ఆటంకం కలుగకుండా గట్టును కొంతమేర తగ్గించడంతో ఇన్‌ఫ్లో పెరిగినట్లు పేర్కొన్నారు.


పంపా రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న దృశ్యం


కోతకు గురైన సముద్ర తీరం

- కెరటాల ఉధృతికి తలపంటిపేట తీరంలో పదిమీటర్ల మేర కోత


తలపంటిపేట తీరంలో సముద్రంకోతకు గురైన దృశ్యం

తొండంగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని సముద్ర తీరం పలుచోట్ల పదిమీటర్ల మేర కోతకు గురైంది. మొంథా తుపాను నేపథ్యంలో కెరటాల ఉధృతికి తీరం నుంచి ఒడ్డుకు సుమారు పది మీటర్ల మేర కోత వేసింది. తలపంటిపేట తీరంలో గురువారం ఉదయానికి ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడి తీరంలో హుకుంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు తమ కార్యకలాపాలు సాగిస్తుంటారు. వారు చేపలు ఎండబెట్టుకునే ప్లాట్‌ఫాం కూడా కెరటాల ఉధృతికి చిన్నాభిన్నమైంది. సమీపంలోని హేచరీల నిమిత్తం వేసిన పైప్‌లైన్లు భూమి మట్టానికి వేయ గా వాటి కింద ఉన్న ఇసుక కూడా కోతకు గురికావడంతో పైపులు కర్రలపై వేలాడుతూ కనిపిస్తున్నాయి.

అక్కడా.. ఇక్కడా.. గోదారే..


గోకవరంలో నీటమునిగిన దేవీపట్నం పునరావాస కాలనీ

దేవీపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుతో గోదావరి ముంపునకు గురైన దేవీపట్నం నుంచి గోకవరం గ్రామశివారు గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఒక పునరావాస కాలనీగా ఏర్పడింది. ఈ పునరావాస కాలనీ నిర్మాణ పనులు గత ప్రభుత్వం మొదలుపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇంకా పూర్తికాలేదు. వర్షాకాలంలో కాలనీ చుట్టూ వర్షపునీరు చేరి గోదావరిని తలపిస్తోంది. దీంతో కాలనీలో నివశిస్తున్న నిర్వాసితులు గోదావరి ముంపు నుంచి దూరంగా తీసుకువచ్చిన అధికారులు ఇక్కడ వరద ముంపునకు గురయ్యేలా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడా గోదారే ఇక్కడా గోదారే అన్నట్లుగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతంలో కాలనీ నిర్మించడంతో వర్షపునీరు ఈ కాలనీలోకి చేరుతుంది. మెట్టప్రాంతంలో నిర్మించాల్సిన కాలనీ ఇలా లోత ట్టు ప్రాంతంలో నిర్మించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కాలనీ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి వర్షపునీరు నిల్వఉండకుండా సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీనివాస్ హత్యకు ఆడియో లీక్ కారణమా..

- ఐదుగురిపై కేసు నమోదు
- పరారీలో నిందితులు


కంచిపల్లి శ్రీనివాస్ (పాతచిత్రం)

అమలాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్యకు దారితీసిన పరిస్థితులపై అమలాపురం పట్టణ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. శ్రీనివాస్ హత్యకు, ఆడియో లీక్‌కు సంబంధం ఏమైనా ఉందా అనే కోణంలోను విచారణ చేపట్టారు. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం తొలుత శ్రీనివాస్ అదృశ్యంపై కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ మృతదేహం 29వ తేదీన పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలోని గోదావరి నదీపాయలో గుర్తించామన్నారు. దాంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో హత్య కేసుగా మార్పుచేశామని వివరించారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖవ్యాపారి గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు), అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, కారు డ్రైవర్ భాస్కర్ల ప్రసాద్, రావులపాలేనికి చెందిన అనిల్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామన్నారు. మృతుని భార్య దేవి తెలిపిన సమాచారం ప్రకారం తన భర్త శ్రీనివాస్ 25వ తేదీ సాయంత్రం వరకు పట్టణానికి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్నతోనే ఉన్నట్టు ఫోన్ సంభాషణల ఆధారంగా చెప్పారు.పాతకక్షల నేపథ్యంలోనే ముందస్తు వ్యూహంతో అప్పన్నే శ్రీనివాస్‌ను వారికి అప్పగించిఉంటాడని భావిస్తున్నారు.

ఆడియో లీకే హత్యకు కారణమా..

ఈ కేసులో ప్రధాన నిందితుడైన గంగుమళ్ల కాసుబాబుతో మృతుడు శ్రీనివాస్‌కు తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగిందని ఆడియో రికార్డింగును బట్టి తెలుస్తోంది. వ్యక్తిగత దూషణలకు సంబంధించిన ఆడియో రికార్డింగుచేసి పలువురికి పంపించడంవల్లే హత్యకు దారితీసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ ఘటన జరిగి కొన్ని నెలలు గడుస్తుంది. ఆడియో లీక్‌తో పాటు మరేదైనా బలమైన కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్‌ను ఎక్కడ హత్య చేశారు. ఏ వాహనంపై గోదారి నదీ పాయ వద్దకు తరలించారు. ప్రధాన నిందితులతో పాటు మరెవరైనా హత్యకు సహకరించారా అన్న కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు. అయితే హత్య జరిగిన రోజు నుంచి ప్రధాన నిందితులు పరారీలోనే ఉన్నారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక బృందాలను నియమించారు. హత్యకు ప్రధాన కారణమైన ఆడియోగా భావిస్తున్న రికార్డింగు వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దా.. దా.. నిన్ను చంపేస్తా అంటూ హెచ్చరించిన మాటలు సైతం ఆడియోలో ఉన్నాయి.

అనపర్తిలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలో మూడు కాసుల బంగారు తాడు చోరీ


పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు విజయలక్ష్మి

అనపర్తి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి కొప్పవరం రోడ్డులో గురువారం రాత్రి మో టార్ సైకిల్‌పై వెడుతున్న దంపతులను వెంబడించిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకుని వెళ్ళడమే కాకుండా వీరి బైక్‌ను కాలితో తన్నడంతో దంపతులు పంటపొలాల్లో పడ్డారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన వడ్లపూడి విజయలక్ష్మి పనులు చేసుకునేందుకు హైదబాద్ వెళ్ళింది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఆమెను ద్వారపూడిలో గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎక్కించేందుకు భర్త రాఘవ ఆమెను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని కొప్పవరం మీదుగా అనపర్తి వస్తున్నారు. అనపర్తి చేరుకునేసరికి గుర్తు తెలియని వ్యక్తి మరో మోటార్ సైకిల్‌పై వెనుకగా వచ్చి ఆమె మెడలోని చైన్ అందిపుచ్చుకుని వారి మోటార్ సైకిల్‌ను కాలితో తన్నడంతో దంపతులు ప్రయాణిస్తున్న వాహనం పంటపొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చొప్పెల్లలో సుడిగాలి విధ్వంసం


చొప్పెల్లలో సుడిగాలితో ధ్వంసమైన ఇల్లు

ఆలమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్లలో సుడిగాలి విధ్వంసం సృష్టించి అనేక ఇల్లుకు నష్టం కలిగించింది. గురువారం ఉదయం గోదావరి నదీ నుంచి చొప్పెల్ల లాకుల మీదుగా చొప్పెల్ల నుంచి నవాబుపేట వెళ్లే రహదారిలో ఉన్న పలు ఇళ్లకు నష్టం కలిగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇళ్లతోపాటు పలు చెట్లుకు భారీ నష్టం కలిగింది. ఈటోర్నోటో భారీ గాలులతో విరుచుకుపడింది. ఇది కేవలం వంద అడుగుల పరిధిలో ధ్వంసం చేసుకుంటూ నష్టం సంభవించింది. ఈప్రమాదం జరిగిన తక్షణం సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య, కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, వీఆర్వో సూర్యప్రకాష్ తదితరులు అక్కడికి చేకుని పరిస్థితి సమీక్షించారు. ఈప్రమాదంలో అనేక ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు భారీగా ధ్వంసమైనట్లు వారు వివరించారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

రాయవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో కుక్కల దాడిలో లేగదూడ మృతిచెందింది. స్థానిక వేంకటేశ్వరస్వామి గుడి వీధిలో గరగ బాబులు పాడిరైతు ఇటీవల లక్ష రూపాయలు తో గేదెను కొనుగోలు చేశాడు. ఇటీవల గేదెకు లేగదూడ పుట్టింది. పశువులపాక వద్ద నాలుగు కుక్కలు దాడిచేసి లేగదూడను హతమార్చాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందడంతో గేదె పాలు ఇవ్వడం లేదని పాడిరైతు ఆవేదన చెందుతున్నాడు. కుక్కల సమస్యను పై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశాడు.

నాటుకోళ్లు దొంగిలిస్తున్న వ్యక్తుల అరెస్ట్


పోలీసులు అరెస్టుచేసిన నిందితులు

గోకవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాటు కోళ్ళు దొంగిలిస్తున్న నల్గురు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబూరావు అనే వ్యక్తి ఇంటి వద్ద పెంచుకుంటున్న నాటుకోళ్ళను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు అందింద న్నారు. దీంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా అదే గ్రామానికి చెందిన అవుల గోపి, కొత్తపల్లి రమేష్, పిల్లల సురేంద్ర, మేడికొండ అనిల్ అనే వ్యక్తులు కోళ్ళు దొంగి లించినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేయడంతో పాటు సుమారు రూ.30,000ల విలువ గల నాటు కోళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. నింది తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'దుంప రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి'

పెద్దాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్రపెండలం దుంప సాగుచేసే రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని దుంప పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి కోరారు. గురువారం ఆమె మండల ఉద్యాన శాఖాధికారి కటకం సత్యశైలజతో కలిసి ఆర్బీ పట్నం గ్రామంలో పర్యటించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా పలు తెగుళ్లు ఆశించే అవకాశముందని, దుంప తోటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద మత్స్యకారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం



తాళ్లరేవు మండలం పెదవలసలలో తుఫాన్ బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు



కరప మండలం ఉప్పలంకలో ముంపు బాధితురాలికి నిత్యావసరాలు అందిస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

మత్స్యకారులకు బాసట, అన్నదాతలకు అండ

తుఫాన్ బాధితులకు 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు... వరి, ఇతర పంట నష్టాల పరిశీలన

కాకినాడ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సముద్రంలో వేటకు వెళ్లక జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు గురువారం కుంభాభిషేకం రేవు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు నష్టం జరగ కుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దుమ్ములపేటకు చెందిన మత్స్యకారుడు గద్దేపల్లి సాయిరాం మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. నిత్యావసర సరుకులను రేషన్ డిపోల వద్ద తీసుకోవాలని కోరారు. కాకినాడ అర్బన్ పరిధిలో 7,582 మందికి సాయం అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనరు కేటీ సుధాకర్, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు వొమ్మి బాలాజీ, పంతాడి రాజు, నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, చోడిపల్లి సతీష్, ఎరిపిల్లి రాము, మోసా పేతూరు, తుమ్మల సునీత, మూగు రాజు, సూరాడ చిన్నారావు, బంగారు సత్యనారాయణ, తుమ్మల కొండలరావు, అల్లం రాజు, ఎలిపే శ్రీను, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాగా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన తనను వేదిక పైకి పిలవడంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మండిపడ్డారు. స్థానిక నాయకులు పద్మశ్రీ-నారాయణ దంపతుల వద్దకు వెళ్లి వేదిక పైకి రావాలని కోరినా అసహనం వ్యక్తం చేస్తూ కారులో వెళ్లిపోయారు. ప్రొటోకాల్ ప్రకారం రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులను వేదికపైకి పిలిచామని అధికారులు చెప్పారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ఆదుకోవడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో తుఫాన్ బాధితులకు 50 కేజీల బియ్యం, పంచదార, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు పంపిణీ చేశారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మత్స్యకారులతో ఫోనులో మాట్లాడుతూ ప్రభుత్వ సాయాన్ని పక్కాగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, ప్రత్యేకాధికారి అడపా వెంకటలక్ష్మి, కామాడి మాతరాజు, లంకే నూకరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా 16వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా అంచనా వేసినట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మండల పరిధిలోని కాండ్రకోటలో దబ్బ కాలువ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని గురువారం ఆయన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఏలేరు జలాశయం నుంచి ఏడువేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని... ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. పర్యటనలో ఆర్డీవో కె.శ్రీరమణి, జలవనరుల శాఖ సూపరింటెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్, డీఈలు ఎ.రవి కుమార్, ఎ.జనార్దన్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో పంట, ఆస్తి నష్టాలపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దారు వెంకటలక్ష్మి సమీక్షించారు. పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు, ప్రభుత్వ సహాయక చర్యలు, పరిహారాల అమలు విధానంపై చర్చించారు.

కరప (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలంక గ్రామంలో 840 మంది మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం, లీటరు ఆయిల్, కిలో చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, కరప ఏఎంసీచైర్మన్ ముద్రగడ రమేష్, తహసీల్దారు తుమ్మల దుర్గాప్రసాద్, ఆర్ఐ సీహెచ్ పవన్, కూటమి నాయకులు బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీల, శిరంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు సుడిగాలి పర్యటన చేశారు. నేలవాలిన, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు. తడిసిన, రంగుమారిన, మొలకలొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం మండలవ్యాప్తంగా 3,500 ఎకరాల్లో పంట దెబ్బతిందన్నారు. మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, కూటమి నాయకులు గండి వెంకటేశ్వరరావు, మద్దూరి స్వామి, చీపురుపల్లి జయేంద్రబాబు, గంటా వీరన్నచౌదరి, అనుకుల రాంబాబు, జోకా తాతాజీ, పుణ్యమంతుల అన్నారం, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, పులపకూర శుభామహేష్, పంపన కన్నారావు, ఆట్ల గోవిందరాజులు, గొల్లపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

యండమూరు, జి.బావారం, సిరిపురం గ్రామాల్లో ముంపు పొలాలను మాజీ మంత్రి కురసాల కన్నబాబు పరిశీలించారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు రొక్కాల గణేష్, కమిడి మంగాదేవి శంకర్, చింతా బుజ్జి, నాయకులు మారెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, చిన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలో 12,855 ఎకరాల్లో వరి పంట నేలవాలినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, టీడీపీ నాయకులు, రైతులతో కలిసి ఉండూరు, వేట్లపాలెం, జి.మేడపాడు, భీమవరం గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను సందర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టం సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. పర్యటనలో టీడీపీ నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ, జి.మేడపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవన్నారాయణ (రవిబాబు), పేపకాయల సుబ్బారావు, ఏఈవో రూపకమల పాల్గొన్నారు. సామర్లకోటలో గురువారం 31 మి.మీ. వర్షపాతం నమోదైందని మండల గణాంక అధికారి ప్రసాద్ తెలిపారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కాకినాడ రూరల్ మండలంలో 650 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కొవ్వూరు, తూరంగి, రేపూరు, చీడిగ, గంగనాపల్లి, తిమ్మాపురం, తమ్మవరం, సర్పవరం గ్రామాల్లో వరి పంట ఈనిక, పాలు పోసుకుని, గింజ పోసుకునే దశలో ఉంది. అధిక వర్షాలకు వరి దుబ్బులు నేలమట్టమ య్యాయి. ఇప్పటిదాకా ఎకరాకు సుమారు రూ.25వేలకు పైగా పెట్టుబడి పెట్టామని, అంతా నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. 650 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపామని మండల వ్యవసాయాధికారి చీకట్ల సత్యనారాయణ చెప్పారు.

పిఠాపురం/గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య గల ఏలేరు కాలువలను, పిఠాపురంలో ముంపునకు గురైన జీవన్‌నగర్ కాలనీని, గొల్లప్రోలు మండలం దుర్గాడ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులతో కలిసి ఆయన పరిశీలించారు. తుఫాన్ కారణంగా ఉత్పన్నమైన పరిస్థితిని, జరిగిన నష్టాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎప్పటికప్పుడు తెలుసుకుని సమీక్షిస్తూ ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నష్టపోయిన రైతులు, ప్రజలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, జనసైనికులు అండగా ఉంటారని చెప్పారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడతో పాటు పలు గ్రామాల్లో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, మునగ తోటలు, ఉల్లి, కాయగూరలు, పత్తి, వరి తదితర పంటలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. నష్టం వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయన వెంట గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, తూము బాబు, లక్ష్మీపతి, బుద్ధరాజు సాయి, బేతా సత్యనారాయణ, మాడెం సతీష్ ఉన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ఇంటి నుంచి బయటకు రాలేక ఇబ్బందిపడుతున్న జగ్గయ్యచెరువు కాలనీలోని కుటుంబాలకు అర్బన్ సొసైటీ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు అండగా నిలిచారు. అటువంటి వారిని గుర్తించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో కూరగాయలు, నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు.



కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో నీట మునిగిన వరి దుబ్బును చూపిస్తున్న రైతు



కరపలో నీట మునిగిన వరి దుబ్బులను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్తిబాబు

నేడు ఐక్యతా ర్యాలీ

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఐక్యతా యాత్ర నిర్వహించనున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పిలుపు మేరకు ఉదయం పది గంటలకు కాకినాడ బాలాజీచెరువు కూడలి వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ జిల్లా పరిషత్ కూడలి వరకు జరుగుతుందన్నారు. గురువారం జరిగిన ఐక్యతా ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం ఇన్‌చార్జి కుండల సాయికుమార్ యాదవ్, పుట్ట గాంధీ, ఏడిద కృష్ణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

'కుంభాభిషేకం రేవు వద్ద పెద్ద వంతెన నిర్మించాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుంభాభిషేకం ప్రాంతంలో దుమ్ములపేటకు వచ్చే కాలువపై గల వంతెన ఇరుకుగా ఉండడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణం పెద్ద వంతెన నిర్మించాలని మత్స్యకార యువకులు గురువారం ఆందోళన చేపట్టారు. దీంతో పోర్టు రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందించేందుకు వచ్చిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో మాట్లాడారు. సాగరమాల ప్రాజెక్టులో ఈ వంతెన మంజూరైందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. దీంతో ఆందోళన విరమించారు. సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ సంఘీభావం తెలిపారు.

కుండపోత వర్షం

పిఠాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 8.45 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆర్టీసీ కాంప్లెక్సు వెనుక వీధి, అనఘా దత్త క్షేత్రం నుంచి ఆర్‌ఆర్ పార్కు వరకు వెళ్లే రోడ్డుతో పాటు చిట్టోడితోట, సీతయ్యగారితోట, విద్యుత్ నగర్, ఉప్పాడ బస్టాండు, సినిమా సెంటర్, పాతబస్టాండు, అంబేడ్కర్ సెంటర్, తారక రామనగర్, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులు జలశయాలుగా మారాయి. పిఠాపురం పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో అన్ని ప్రభుత్వ, మున్సిపల్, మండల, జిల్లా పరిషత్ పాఠశాలలకు భారీ వర్షం కారణంగా గురువారం సెలవు ప్రకటించారు. ప్రైవేటు పాఠశాలలను తెరవడంతో విద్యార్థులు అష్టకష్టాలు పడ్డారు. యానాదుల కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు నీటిని బయటకు తోడుకోవాల్సి వచ్చింది.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో సుమారు మూడున్నర గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. ప్రధాన రహదారులపై వర్షపు నీరు ప్రవహించగా వాహనచోదకులు అందులోంచే రాకపోకలు సాగించారు. రాయవరం సెంటర్ జలశయాన్ని తలపించింది. మెయిన్‌రోడ్డులో నీరు తగ్గేందుకు మూడు గంటలు పట్టింది. ఎక్కడికక్కడ డ్రైన్లు పొంగిపొర్లాయి.



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్



సామర్లకోట మండలం వేట్లపాలెంలో నేలవాలిన వరి చేనును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఏలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్

నేటి నుంచి వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలు

పిఠాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతాన గోపాలస్వామిగా ప్రసిద్ధిగాంచిన పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఒకటో తేదీ ఉదయం మహిళా భక్త సమాజం సభ్యులతో స్వామి, అమ్మవార్లకు కల్యాణ అలంకారం, గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి కల్యాణం జరుగుతాయి. 2న శేషవాహనంపై గ్రామోత్సవం, 3న సదస్యం, 4వ తేదీ రాత్రి రథోత్సవం, 5వ తేదీ ఉదయం చక్రస్నానం, గరుడ వాహనంపై గ్రామోత్సవం, 6వ తేదీ రాత్రి శ్రీ పుష్పయాగం నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గజ, గరుడ, శేష వాహనాలకు రంగులు వేశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఈవో నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ తెలిపారు. స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు కోరారు.



రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

'బ్రెయిన్ స్ట్రోక్‌ను మొదటి నాలుగు గంటల్లో గుర్తించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు ఏమిటి, దానిని ఎలా గుర్తించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా నియంత్రించాలని అనే అంశాలను ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కాండ్రేగుల శివరాం గాంధీ వివరించారు. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా అపోలో హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఒబెసిటీ ఉన్నవాళ్లు నియంత్రణలో పెట్టుకుంటే బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. తమ ఆసుపత్రిలో అత్యున్నత చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ ఎంవీవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన మొదటి నాలుగు గంటలలోపు న్యూరో ఫిజీషియన్ కన్సల్టేషన్ తీసుకుంటే పక్షవాతం బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆలస్యమైతే బ్రెయిన్ హెమరేజ్‌కు కూడా దారితీయవచ్చన్నారు. సమావేశంలో అపోలో మేనేజ్‌మెంట్ తరపున యూనిట్ మార్కెటింగ్ హెడ్ ఎస్.అంజిబాబు, డీజీఎం (ఆపరేషన్స్) జీవీఆర్ మూర్తి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మనిషారోస్, సీవోవో డాక్టర్ రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివరాం గాంధీ

ఉప్పాడ తీరంలో బంగారం రజను లభ్యం పుకార్లు మాత్రమే: సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ అనంతరం ఉప్పాడ తీరంలో బంగారం రజను లభ్యమవుతోందని ఆకతాయిలు పుకార్లు సృష్టించారని, వాటిని నమ్మవద్దని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ కోరారు. అలలు ఎగసిపడుతుండడంతో తీర ప్రాంత ప్రజలకు ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టామన్నారు. కొందరు బంగారం కోసం వెదుకుతూ సముద్రంలోకి వెళ్తున్నారన్నారు. ఈ విషయం తమ దృష్టికి రావడంతో పోలీసు గస్తీ ఏర్పాటుచేశామన్నారు. తుఫాన్ తీరం దాటినా కెరటాల ఉధృతి కొనసాగుతోందన్నారు.

'మెడికవర్'లో బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యవసర చికిత్స

సామర్లకోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌ను సకాలంలో గుర్తిస్తే పేషెంట్‌ను యథాస్థితికి తీసుకొచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయని, తమ వద్ద అత్యవసర చికిత్స ఉందని సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం వెల్లడించింది. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డేను పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆసుపత్రి ఆవరణలో సెంటర్ హెడ్ శుభాకరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ కృష్ణభాస్కర్ మాట్లాడుతూ వంశపారంపర్యం, షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, స్థలకాయం, మద్యం సేవించడం, పొగతాగడం, గుండె సమస్యల వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. స్ట్రోక్‌కు గురైన 60 నిమిషాలలోపు హాస్పిటల్‌కు తీసుకొస్తే థ్రాంబోలైసిస్ ఇంజక్షన్ (లేదా) థ్రోంబెక్టమీ ప్రొసీజర్ చేసి రికవరీ చేయవచ్చన్నారు. అనంతరం మరో న్యూరోసర్జన్ డాక్టర్ చందు లింగోలు మాట్లాడారు. గోడ పత్రికలను సెంటర్‌హెడ్ శుభాకరరావు, మెడికల్ సూపరింటెండెంట్ జాసన్ ఇసాక్, ఆసుపత్రి సిబ్బంది విడుదల చేశారు.



మెడికవర్ ఆసుపత్రిలో గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

17న కాకినాడలో మెగా ఐక్యతా యాత్ర



సర్పవరం జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యువతలో ఐక్యత, దేశభక్తి స్ఫూర్తి నింపేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 17న నిర్వహించనున్న మెగా ఐక్యతా యాత్ర (యునిటీ మార్చ్)ని జయప్రదం చేయాలని జిల్లా యువజన శాఖ అధికారి (ఇన్‌చార్జి) టి.గోపి కోరారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఐఐసీలోని జిల్లా యువజన శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన యునిటీ మార్చ్ పోస్టర్స్‌ని ఆవిష్కరించారు. 17న కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి ఆదిత్య మహిళా డిగ్రీ కాలేజీ వరకు యువత, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో సుమారు 8 కిలోమీటర్ల మేర మెగా ఐక్యతా పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. దీనిని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రారంభిస్తారని, కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశంలో మై భారత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు క్రీడా ఎంపిక పోటీలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్రవారం జిల్లా క్రీడా మైదానం (డీఎస్ఏ)లో నిర్వహించనున్నట్టు ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో అండర్-14, అండర్-17 బాల, బాలికల విభాగాల్లో బాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరుగుతాయన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 9.30 గంటలకు జిల్లా క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు.

కౌన్సిల్ అనుమతి లేకుండా పనులెలా చేపడుతున్నారు

పెద్దాపురం మున్సిపల్ సమావేశంలో అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్లు

పెద్దాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ అనుమతి లేకుండా పనులు ఎలా చేపడుతున్నారని, ఎవరి ఒత్తిడితో చేస్తున్నారని అధికారులను కౌన్సిలర్లు ప్రశ్నించారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం గురువారం జరిగింది. కౌన్సిలర్ ఆరెళ్ల వీరరాఘవులు మాట్లాడుతూ పనులు చేపట్టే ముందు కౌన్సిల్‌కు తెలియచేయక్కర్లేదా అని ప్రశ్నించారు. మున్సిపాల్టీలో జనరల్ ఫండ్ బ్యాలెన్స్ ఎంతుందో తెలియజేయాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు నిర్వహించాలన్నారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ తమ వార్డులో పనులు పూర్తికాలేదని, 40 మీటర్ల పొడవైన డ్రైన్‌ను నెల నుంచీ పూర్తి చేయకుండా వదిలేశారన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లకు పన్ను విధింపుపై స్పష్టత ఇవ్వాలన్నారు. సమావేశంలో కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి, మేనేజరు జ్యోతిరాణి, డీఈ ప్రకాశరావు, ఆర్వో అచ్యుతరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, టీపీవో ఫణికుమార్ పాల్గొన్నారు.

ఆగాకర పంటకు అపార నష్టం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, ఈదురు గాలులు, వర్షం ప్రభావంతో ఆగాకర పంటకు అపార నష్టం వాటిల్లింది. గొల్లప్రోలు మండలం వన్నెపూడి తదితర గ్రామాల్లో రైతులు పందిరి పంటగా ఆగాకర సాగు చేస్తారు. గాలుల తాకిడికి పందిర్లు నేలనంటడంతో పాటు మొక్కలు విరిగిపోయాయి. సుమారు 110 ఎకరాల్లో ఎకరానికి రూ.లక్షకు పైగా నష్టపోయామని, పందిర్లు మరలా కట్టుకోవాలని రైతులు చెప్తున్నారు.

వరద బాధితులకు జనసేన సహాయం

శంఖవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు జనసేన నేతలు అండగానిలిచారు. ఆర్థిక సహాయం, బియ్యాన్ని అందించారు. గురువారం కత్తిపూడి, కొండగౌరంపేట గ్రామాలలో బాధితులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. సమస్యలను ఎంపీ తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్ దృష్టికి తీసుకెళతామని జనసేన నేత, రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యులు తెలిపారు. మేకల కృష్ణ, రావూరి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తుఫాన్‌తో పొంగిన వాగులు

● స్తంభించిన జనజీవనం ● సుమారు పది గంటలు నిలిచిన రాకపోకలు


ఇందుకూరు1 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

దేవీపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వెలగపల్లి వద్ద సీతపల్లి, కొర్రైగడ్డ, ఇందుకూరుపేట గ్రామ సమీపంలో ఇనుకొండ, లోతుపాలెం, ఫజుల్లాబాద్ గ్రామ సమీపంలోని వాగులు ఉధృతంగా పొంగి ప్రవహించాయి. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇందుకూరుపేట నుంచి గోకవరం, కోరుకొండ, రంపచోడవరం వెళ్లడానికి మార్గం లేకుండా పోయింది. వాగులు వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టి గస్తీ నిర్వహించారు.

దూసరిపాములో ఇళ్లల్లోకి వరద

రాజవొమ్మంగి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వాగులు పొంగిపొర్లడంతో తంటికొండ, దూసరిపాములో సుమారు 10 ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరింది. అలాగే వట్టిగెడ్డ-ఎర్రంపాడు, దూసరిపాము-లబ్బర్తి, రాజవొమ్మంగి-శాంతినగర్ మధ్య రోడ్లపై వాగులు పొంగి ప్రవహించడంతో లోతట్టు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీడీవో యాదగిరేశ్వరావు, డిప్యూటీ ఎంపీడీవో విజయకుమార్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేకాధికారుల పర్యటన

వై.రామవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల లోతట్టు ప్రాంతాలలో గురువారం మండల ప్రత్యేకాధిరి దయానంద తనిఖీ చేపట్టారు. దీనిలో భాగంగా ధారగడ్డ సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. గుర్తేడు పిహెచ్‌సీ తనిఖీ చేసి పలు అవసరాలను గుర్తించారు. ఎంపీడీవో బాపన్న దొర, ఉపాధి ఏపీవో స్వామి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ధారగడ్డ - గుర్తేడు మధ్య రహదారిపై పడిన భారీ వృక్షాన్ని గురువారం తొలగించారు. మండల ప్రత్యేకాధికారి దయానంద ఆదేశాలతో సిబ్బంది చర్యలు చేపట్టారు.

మాకు పోలవరం పరిహారం ఇవ్వండి

కూనవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తమకు పోలవరం పరిహారం ఇవ్వాలని ముల్లూరుకు చెందిన గ్రామస్థులు కలెక్టర్‌ను కోరుతున్నారు. 2008-2009 సంవత్సరంలో తమ గ్రామానికి భూమికి పరిహారం ఇచ్చారని అప్పటినుండి ఆ గ్రామానికి ఆర్ అండ్ ఆర్ సర్వే గానీ ఇళ్ల సర్వే కానీ చేయలేదన్నారు. అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఎకరానికి లక్ష 15 వేల రూపాయలు ఇచ్చిందని దానివల్ల తాము ప్రస్తుతం వరదలు వచ్చినప్పుడు కానీ తుఫాన్‌లు వచ్చినప్పుడు కానీ పరిహారం ఇచ్చే జాబితాలో నుంచి తీసివేశారన్నారు. దీనివల్ల స్థానిక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే తమ గ్రామానికి పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని ఆర్ అండ్‌ఆర్ ఇళ్ల సర్వే నిర్వహించి తమ గ్రామానికి పునరావసం కల్పించాలన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు ఇక్కట్లు

కూనవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రేఖపల్లి నుంచి భద్రాచలంకు తిరిగే ఆర్టీసీ ఆర్డినరీలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోకవరం డిపోకు చెందిన మూడు బస్సులను రేఖపల్లి నుంచి భద్రాచలంకు సర్వీసులుగా నడుపుతారు. అయితే ఈ ప్రాంతంలో చిన్నపాటి పాక్షిక బంద్‌లు జరిగినా బస్సులు నిలిపివేసే డిపో అధికారులు మొంథా తుఫాన్‌కు వల్ల బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. అసలు ఈ ప్రాంతంలో తుఫాన్ ప్రభావమే లేదు అయినా బస్సులను ఆపేశారు. గురువారం సైతం బస్సులు తిరగకపోవడంతో ప్రమాణికులు ఇబ్బందులు పడ్డారు.

మేజిక్ డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీనివాస్

రంపచోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గృహాల సముదాయంలో మేజిక్ డ్రైనేజీలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఇర్లపల్లిలో రూ.లక్షా యాభైవేలతో చేపట్టిన మేజిక్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ నాణ్యతతో రాజీపడకుండా కొలతల మేరకు నిబంధనలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో బీ.సత్యనారాయణ, జూనియర్ ఇంజనీర్ ఏడ్విన్‌బాబు, సాంకేతిక సహాయకులు సూర్రెడ్డి, శేఖర్, వాకా వీరన్న, ఫీల్డ్ అసిస్టెంట్ వీరమణి, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రంపచోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు, ఇల్లా రామిరెడ్డి, వేట్ల విజయ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలులో ప్రభుత్వాలు విఫలం


మాట్లాడుతున్న కుంజా శ్రీను

రంపచోడవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదివాసీ చట్టాలకు రక్షణ కరువైందని, హక్కులు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నాయన్నారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబునాయుడు జీవోనెం.3కి ప్రత్యామ్నాయంగా చట్టాన్ని తీసుకువచ్చి ఏజెన్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకు ఇస్తామని చెప్పి ఇప్పుడు నట్టింట ముంచారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు చోడి ప్రదీప్‌కుమార్‌దొర, కలముల ప్రసాద్‌దొర, జోగిరాజు, శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

మారేడుమిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులను ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని మారేడుమిల్లి పంచాయతీ సర్పంచ్ కొండా జాకోబు అన్నారు. గురువారం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలను ఆయన సందర్శించారు. మోసూర్ గ్రామంలో గిరిజన రైతు రామిరెడ్డి గృహంపై భారీ చెట్టు పడి ధ్వంసమైంది.గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించి తగు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు పాల్గొన్నారు.

చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ బదిలీ

చింతూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 ఆగస్టు 19న ఏఎస్పీగా విధులు స్వీకరించారు. కాగా ఆయనకు అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బదిలీ చేసింది.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తుఫాన్‌కు నేలకొరిగిన వరి, అరటి పంటలు



ఏలేశ్వరం: యర్రవరంలో నేలకొరిగిన అరటితోట, తుని: తేటగుంటలో దెబ్బతిన్న వంగ తోటను చూపిస్తున్న రైతులు

పంటను అంచనా వేసే పనిలో అధికారులు

ఏలేశ్వరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ అన్నదాతలను నిండా ముంచేసింది. మండలంలోని లింగంపర్తి, భద్రవరం, పేరవరం, సిరిపురం, యర్రవరం, తిరుమాలి గ్రామాల్లో వరి పంట, అరటితోట సుమారు వరి పంట 841 హెక్టార్లు, 20హెక్టార్లు నేలకొరిగినట్లు అధికారులు వెల్లడించారు. పంట నష్టాన్ని పరిశీలించి, అంచనావేసే పనిలో అధికారులు ఉన్నారు. దీంతో రైతులు చేతికి పంట వచ్చిన ఈదురుగాలులు ,వర్షాలు కారణంగా నేలకొరగడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3వేల ఎకరాల వరి పంటకు నష్టం

కిర్లంపూడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో మండలంలో గాలులకు 3150 ఎకరాలకు పైబడి పంట నష్టం వాటిల్లినట్లు వ్యవయాధికారి సుధామాధురి తెలిపారు. రైతులు ఈ తుఫాను ప్రభావం తప్పినప్పటికీ ఏలేరు నీరు ఎక్కువగా కిందకు వదలడంతో మళ్లీ దిగాలు చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించిన పంట చేజారిపోతుందని లబోదిబోమంటున్నారు. రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్‌శాఖ పరిధిలో మండలంలో 39 స్తంభాలు, ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు, 1.2 కెఎంఎల్ కేబుల్‌వైర్లు నష్టపోయినట్లు వాటి అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తున్న కిర్లంపూడి ఇన్‌చార్జి ఏఈ తెలిపారు. మండలంలో కృష్ణవరం, బూరుగుపూడి, పాలెం, సోమరాయణంపేట గ్రామాల్లో పదెకరాల్లో అరటి, కూరగాయాలకు నష్టం వాటిల్లిందని ఉద్యానవన శాఖాధికారి దివ్యశ్రీ తెలిపారు.

వరి, పత్తి పంటలకు నష్టం

తుని రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర ప్రభావం చూపించింది. ఈదురుగాలులు, వర్షం జనాన్ని వణికించాయి. తీవ్రత తగ్గిన గురువారం తెల్లవారుజామున కురిసిన ఎడతెరిపి లేని వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. తిమ్మాపురం, గవరపేట, హంసవరం, జిల్లేడుపాడు, పలుగ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖ పరిధిలో పంటలకు నష్టం వాటిల్లింది. తిమ్మాపురం శివారు తాండవ జలాలు పొంగిపొర్లడంతో జలజీవనం స్థంభించింది. రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో అటుగా తుని రూరల్ పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. ఆప్రాంత వాసులు రాకపోకలపై అప్రమత్తతచేసి అవగాహన కల్పించారు.

రహదారిపై పంపా వరద నీరు ప్రవాహం


పి.అగ్రహారం వద్ద రహదారిపై ప్రవహిస్తున్న పంపా వరద నీరు

తొండంగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పంపావరద నీరు దిగువకు వదిలివేయడంతో పి.అగ్రహారం వద్ద వరద నీరు రహదారి మీదుగా ప్రవహిస్తోంది. పంపా వరద గేట్ల ద్వారా 1800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల కావడంతో తిమ్మాపురం పి.అగ్రహారం గ్రామాల నడువ రహదారి మీదుగా వరద నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాలిలోతు నీటిలో ప్రవాహం గుండా రావాల్సి వస్తోంది, రాత్రికి నీటి విడుదల తగ్గిస్తారని దీనివలన ఇబ్బంది ఉండదని తహసీల్థార్ కాంతారావు తెలిపారు. పంపా కాల్వలు పొంగిపొర్లడంతో రహదారి మీదుగా నీరు పారుతోందన్నారు.

నిత్యావసరాల అందజేత

రౌతులపూడి, అక్టోబర్30(ఆంధ్రజ్యోతి): ఎ.మల్లవరంలో మొంథా తుఫాను దాటికి ఉండ వరహాలుకు చెందిన పెంకుటిళ్లు కూలిపోయింది. బాధిత కుటుంబాన్ని టీడీపీ యువనేత లెక్కల రాము, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గౌవిరెడ్డి గురునాథ్ పరామర్శించారు. గురునాథ్ సొంత సొమ్ములతో బియ్యం నిత్యావసర సరుకులు అందజేయగా, ప్రభుత్వం సహాయం కింద అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): పాలెం గ్రామానికి చెందిన చిక్కిరెడ్డి సోమరాజు ఇళ్లు మొంథా తుపాన్‌తో కూలిపోయింది. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ గురువారం బాధిత కుటుంబానికి నితావ్యసరాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందజేసేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పాలెం బాబీ, ధర్మపురి, గన్నిరాజు, అడబాల నల్లబాబు ఉన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే


తునిలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. గురువారం తుని పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో తుఫాన్ బాధితులకు ఆమె నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 25కిలోల బియ్యం, కూరగాయాలు,నూనె, చక్కెర అందించారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకుడు ముందు చూపు గల నాయకుడని ఎంతటి విపత్తినుంచైనా గట్టెక్కించగల సమర్థుడు అన్నారు. ఆమె వెంట తుని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, తుని మండల టీడీపీ అధ్యక్షులు చింతమనీడి అబ్బాయి, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మున్సిపల్ మాజీ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుక్కడపు బాలాజీ, కుసుమంచి సత్యనారాయణ తదితరులు ఉన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దివ్య తెలిపారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు.

రైతులకు సహాయం అందిస్తాం: ఎమ్మెల్యే సత్యప్రభ


ఉత్తరకంచిలో వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అం డగా ఉంటుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. ధర్మ వరం, పెద్దిపాలెం గ్రామాల్లో భారీ ఈదురు గాలు లు, వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న పంటలను గురువారం సాయం త్రం ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులతో క్షేత్రస్థాయిలో పంట నష్టాలను ప్రత్య క్షంగా పరిశీలించి ఎమ్మెల్యే సత్య ప్రభ రైతుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు పత్తి, వరి పంటలతో పాటు అరటి, బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయల పంటలు నష్టపోయిన పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించి, స్థానిక రైతులు, వ్యవ సాయ అధికారులు నుంచి వివరాలు సేకరించారు. అనంతరం వేములపాలెంలో బాధిత కుటుంబానికి సరుకులు, సహాయం అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీ శనివారం 11కేవీ జగ్గంపేట ఇండస్ట్రీయల్ ఫీడర్, నరేంద్రపట్నం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపిస్తామని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. టవర్ కాలనీ, జగ్గంపేట, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాలకు, బోరులకు, రామవరంలో ఉన్న ఇండస్ట్రియల్ సర్వీసులకు, మర్రిపాక చేపల చెరువులకు, కాండ్రేగుల, బావవరం బోరులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చనను విజయవంతం చేయండి

ప్రత్తిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతిపాడులోని డీసీసీబీ బ్యాంకు సమీపంలో గురుభవాని పత్రి రమణ ఆధ్వర్యంలో నవంబరు 3న సోమవారం జరగబోయే కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చనలను జయప్రదం చేయాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని కోరారు. గురువారం రాత్రి ఆయన కోటి దీపోత్సవ కమిటీతో కలిసి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గానాల గంగాధర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా సంఘాలతో సమావేశమైన పీడీ శ్రీనివాస్

మొండి బకాయిలను వసూలు చేయండి

డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్

తొండంగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రుణం తీసుకుని చెల్లించని డ్వాక్రా సంఘాల నుంచి మొండి బకాయిలను అవసరమైతే కేసులు పెట్టి వసూలు చేయాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం ఆయన ఏ.కొత్తపల్లి, తొండంగి, బెండపూడి తదితర గ్రామాల్లో డ్వాక్రా సంఘాలు చెల్లించని రుణాల చెల్లింపుల నిమిత్తం ఆయా సంఘాలతో సమావేశమయ్యారు. రుణాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా సుమారు 52 లక్షల బకాయిలు ఉండడంపట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో చెల్లించని సంఘాలపై గ్రామ సంఘాల ప్రతినిధులను తీసుకువెళ్లి కేసులు పెట్టాలని సూచించారు. స్త్రీ నిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి తదితర రుణాలు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం, సౌభాగ్యవతి, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

జగ్గంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి స్కూల్స్ పునఃప్రారంభం అయ్యాయి. ఒకటో తరగతి నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య 13వేలు ఉండగా, తొమ్మిది వేలు హాజరైనట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు.



ఏలేశ్వరం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలను సీనియర్ అసిస్టెంట్ శేష చదువగా పలువురు కౌన్సిలర్లు ఆమోదించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీలో 20 వార్డులకు విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి సుమారు రూ.4కోట్లు నిధులు వెచ్చించామన్నారు. లచ్చారావుకాలనీ, చైతన్యనగర్ కాలనీలో తాగునీటికి ట్యాంకులు నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే సత్యప్రభను సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ సూర్యప్రకాశరావు, వైస్ చైర్‌పర్సన్‌లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణ స్వామి, బొదిరెడ్డి గోపి, బదిరెడ్డి గోవింద్, సుంకర హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌ను కలిసిన కాపు సంక్షేమ సంఘం కమిటీ

జగ్గంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు మీసాల చినబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు కలిశారు. వారిని నవీన్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జగ్గంపేట మండల అధ్యక్షుడు జీను మణిబాబు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, తెలుగు యువత మండల అధ్యక్షుడు రాయిసాయి, కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు జీను పెద్దరాంబాబు, దవులూరి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు మారిశెట్టి రాధా, తులా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్యనారాయణ, కోశాధికారి భైరవ స్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సూరన్న, గెడ్డమూరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించే రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాజ్యాంగ దినోత్సవ ప్రోగ్రాం కన్వీనర్ కె.సాయికుమార్ యాదవ్ కోరారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఐక్యత యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల పోస్టర్‌ను సాయికుమార్ ఆవిష్కరించారు. ఐక్య త యాత్ర కార్యక్రమాలను పండుగ వాతా వరణంలో నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు.

వదలని వర్షం

ప్రత్తిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజుల నుంచి విరామం లేకుండా కురుస్తున్న ఈ వర్షాల వల్ల మండలంలోని పలు ప్రాజెక్టులు, చెరువుల్లోకి వర్షపునీరు వస్తున్నది. దీంతో చెరువులు, ప్రాజెక్టులకు జళకళ సంతరించుకుంది. గురువారం తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, మండల వ్యవసాయాధికారి జోకా అమృత, వ్యవసాయ సిబ్బంది, సర్వే బృందాలు మండలంలోని పంట నష్టాల నమోదు వివరాలు చేపట్టారు. తుపాన్ వల్ల నష్టపోయిన బాధితులకు సాయం అందిస్తామని తహసీల్దార్ తెలిపారు.

తగ్గని ఏలేరు ఉధృతి

కిర్లంపూడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ తప్పినప్పటికీ ఏలేరు వరదనీరు వల్ల నష్టపోయే ప్రమాదముందని హడలిపోతున్నారు. ఏలేరు కాలువను ఆనుకుని ఉన్న ఎర్రకాలువ గండిపడడంతో తహసీల్దార్ జె.చిరంజీవి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. టీడీపీ స్థానిక నాయకులు భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, కరణం బూరయ్య, కాసా సంతోష్ పనులు చేపట్టేలా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఏలేశ్వరం ప్రాజెక్టు పరిశీలన అనంతరం రాజుపాలెంలో ప్రధాన ఏలేరు కాలువలను పరిశీలించారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కోనసీమ జిల్లాలో సంభవించిన మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన చేతి వృత్తిదారులైన కుమ్మరి శాలివాహనులను ఆదుకోవాలని రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ కోరారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం వద్ద బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను గురువారం చైర్మన్ ఈశ్వర్ కలిసి కుమ్మరి శాలివాహనుల సమస్యలు వివరించారు. తుపాను కారణంగా ఈ రెండు జిల్లాల్లో కుమ్మరి చేతివృత్తిదారులకు అపారనష్టం కలిగిందన్నారు. చేతివృత్తిదారులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి సవితను కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ కోరారు.

కనులపండువగా కోటి బిల్వార్చన

శంఖవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సిద్ధివారిపాలెం అయ్యప్పస్వామివారి కోటి బిల్వార్చన కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజామునుంచే ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివారావు గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులు దర్శనం కల్పించారు. సుదూరప్రాంతాల నుంచి అయ్యప్ప మాలదారులు,భక్తులు ఈక్రతువులను తిలకించారు. అయ్యప్ప విడుముళ్ళను సమర్పించే మాలదారులకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు భోజన వితరణ చేశారు.

బాధిత కుటుంబానికి చేయూత

రౌతులపూడి, 30(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో నియోజకవర్గ నాయకులు, నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గెద్దానాపల్లి తాతీలు, కంచర్ల విజయకుమారి కుటుంబాన్ని పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి ఐదు వేలు చొప్పున అందజేసారు. వైసీపీ నాయకులు రాపర్తి రామకృష్ణ, కడారి నగేష్, కందేపల్లి శ్రీను, కోలా తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు సహాయం

ప్రత్తిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు మండలంలోని తుపాన్ బాధితులకు అండగా ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు సహాయక కార్యక్రమాలు చేపట్టింది. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా ఇళ్ళుకూలి నిరాశ్రయులైన ఇరువురు కుటుంబాలకు గురువారం ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆర్థిక సహాయం అందించారు. ఒమ్మంగిలో గోపుబాబ్జి, కాపు కుటుంబాలకు రూ.10వేలు అందించారు. అదే గ్రామంలో తుఫాన్ కారణంగా పక్కా ఇళ్లు పాక్షికంగా కూలిపోయి ఇబ్బంది పడుతున్నచుక్కల తాతారావుకు మరో రూ.5వేలు అందించారు. గ్రామంలో అనారోగ్యానికి గురైన షేక్ సత్తిబాబును పరామర్శించి రూ.5వేలు అందించారు.


సరుకులను అందిస్తున్న రాజేష్

నిత్యావసర సరుకుల పంపిణీ

తొండంగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాను బాధిత మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసర సరుకుల కిట్లను టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ గురువారం పంపిణీ చేశారు. పెరుమాళ్లపురం పంచాయతీలోని పాతచోడిపల్లిపేట తదితర గ్రామాల్లో బియ్యం, పప్పు, నూనె, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు తదితర సరుకులతో కూడిన కిట్లను బాధిత కుటుంబాలకు ఆయన అందించారు. ఎమ్మెల్యే యనమల దివ్య, యనమల రామకృష్ణుడు కృషితో మత్స్యకారులకు ప్రత్యేక ప్యాకేజీ అమలవుతుందన్నారు. మండలంలో సుమారు 10 వేల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయన్నారు. కార్యక్రమంలో చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, ప్రత్యేకాధికారి శ్రీధర్, తహశీల్థార్ కాంతారావు, ఎంపీడీవో సాయి నవీన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.